# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ఆర్టీసీకి “గవర్నెన్స్ నౌ - 6వ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్” అవార్డు రావడం గర్వకారణమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.
- వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, అధికారుల బృందం రేపు దావోస్ వెళ్లనుంది.
- ఏడాదిలోగా రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసి రైతులకు అండగా నిలుస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు.

==========================

ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కాకినాడలో 18 వేల కోట్ల రూపాయలతో ఏర్పాటు చేయనున్న ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తో కలిసి ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... కాకినాడలో ఏర్పాటయ్యేది ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా పరిశ్రమని, 2027 జూన్ నాటికి మొదటి దశ ఉత్పత్తి ప్రారంభమవుతుందని తెలిపారు. గ్రీన్ అమ్మోనియా వల్ల వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుందని, ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా అభివృద్ధి చేస్తామని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

అనంతరం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... కాలుష్య రహిత ఇంధన ప్రయాణంలో గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్ట శంఖుస్థాపన ఒక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని, ఈ ప్రాజెక్టు వల్ల వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతారని పేర్కొన్నారు.

=========================

ఏపీఎస్ ఆర్టీసీకి ప్రతిష్టాత్మక “గవర్నెన్స్ నౌ- 6వ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్” అవార్డు రావడం గర్వకారణమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. అన్ని ప్రధాన బస్ స్టేషన్లలో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ (AAS)ను ఏర్పాటు చేసి అమలు చేస్తున్నందుకు 2025 ఏడాదికి గాను ఏపీఎస్ ఆర్టీసీ ఈ అవార్డుకు ఎంపికైంది. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఢిల్లీలో ఈ అవార్డు అందుకున్నారు. దీనిపై స్పందించిన మంత్రి.. ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది.. ప్రయాణికులకు అంకితభావంతో సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. డిజిటల్ సాంకేతికతను ప్రజాసేవకు వినియోగించిన ఆర్టీసీ కృషికి జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు.

=========================

ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గ పరధిలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఈరోజు శంకుస్థాపనలు చేశారు. దర్శిలో 4 కోట్ల 19 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న విద్యుత్ శాఖ డీఈ కార్యాలయ భవనానికి, పెద్ద ఉల్లగల్లు గ్రామంలో 4 కోట్ల రూపాయలతో నిర్మించనున్న విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ... డీఈ కార్యాలయం, సబ్ స్టేషన్ నిర్మాణ పనులను 6 నెలల్లో పూర్తి చేస్తామన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

=========================

వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, అధికారుల బృందం రేపు దావోస్ వెళ్లనుంది. 4 రోజుల పాటు దావోస్‌లో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సులో వివిధ పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి ముఖాముఖి భేటీలు, పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఆదివారం రాత్రి 8 గంటల 35 నిమిషాలకు విజయవాడ విమానాశ్రయం నుంచి బయల్దేరి ఢిల్లీ వెళ్లనున్న ముఖ్యమంత్రి.. అక్కడి నుంచి జ్యూరిచ్‌కు వెళ్తారు. దావోస్‌లో తొలిరోజు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక, పర్యాటక విభాగాల మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో వివిధ దేశాల మధ్య జరిగే సమావేశంలో ఆయన పాల్గొంటారు. అనంతరం టాటాసన్స్ చైర్మన్ ఎన్. చంద్ర శేఖరన్.. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో కలిసి ముఖ్యమంత్రితో సమావేశం కానున్నారు.

విరామం

=========================

కనెక్టివిటిను పెంచడం ద్వారా శ్రీకాకుళం అభివృద్ధికి కృషి చేస్తున్నామని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని తిలారు రైల్వే స్టేషన్‌లో బ్రహ్మపూర్ - విశాఖ ఎక్స్‌ప్రెస్ నూతన హాల్టును మంత్రి అచ్చెన్నాయుడుతో కలసి కేంద్రమంత్రి ఈరోజు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. తిలారుతో పాటు హరిశ్చంద్రపురం స్టేషన్ ను అభివృద్ధి చెయ్యాల్సిన అవసరం వుందన్నారు. మూలపేట పోర్టు ద్వారా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని కేంద్రమంత్రి తెలిపారు.

=========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 23వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

=========================

ప్రకృతి వ్యవసాయంతోనే ఆర్థిక పరిపుష్టిని సాధిస్తున్నామని తిరుపతి జిల్లాకు చెందిన రైతులు తెలిపారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతంతోనే పంటలు పండించి ప్రజలకు రసాయనాలు లేని కూరగాయలను అందిస్తున్నామన్నారు. సేంద్రీయ వ్యవసాయంపైనే దృష్టి కేంద్రీకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపును తూచా తప్పకుండా పాటిస్తున్నామని తిరుపతి జిల్లాకు చెందిన మహిళా రైతు నాగవేణి పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

==========================

విశాఖపట్టణంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్)లో వైద్యం కోసం వచ్చే రోగులను సిబ్బంది డబ్బులు అడిగితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ హెచ్చరించారు. కేజీహెచ్ లో ఆయన ఈరోజు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కేజీహెచ్ లో వైద్యం కోసం డబ్బులు అడిగినట్టు రోగి బంధువులు తనకు తెలిపారని, ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ ను ఆదేశించినట్లు తెలిపారు. ఎవరైనా డబ్బులు అడిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేజీహెచ్ లో ఉచితంగా వైద్యం లభిస్తుందని తెలియజేసే బోర్డులు పెట్టాలని సిబ్బందికి సూచించారు.

==========================

ఈ ఏడాది డిసెంబర్ నాటికి రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థలోని లోపాలను పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రజలకు, రైతన్నలకు అండగా నిలుస్తామని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలంలో ఈరోజు రైతులకు పాస్ పుస్తకాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రైతుల భూములకు పూర్తి చట్టబద్ధత కల్పిస్తూ... నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ రాజముద్రతో జారీ చేస్తున్న ఈ పట్టాదారు పాస్ పుస్తకాల్లో వున్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి భూ యజమానికి సంబంధించిన అన్ని వివరాలు తెలుసుకోవచ్చని మంత్రి పేర్కొన్నారు.

==========================

కోస్తాంధ్రప్రదేశ్, యానాం, రాయలసీమ ప్రాంతాలలో రాగల 48 గంటల్లో ఈశాన్య ఋతుపవనాల వర్షాలు నిష్క్రమించటానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలిపారు.

==========================

==========================